# ఈ పాపం ఎవ్వరిది??

-నూకల విజయ్‌కుమార్

జూబ్లీహిల్స్..ఏప్రిల్ 17. వెన్నెల అనే ఇరవై నాల్గేళ్ళ యువతి నిన్నరాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహం వద్ద లభ్యమైన ఉత్తరంలో "తన చావుకి ఎవరూ కారణం కాదనీ, విపరీతమైన మానసికక్షోభకు గురై తానీ నిర్ణయం తీసుకున్నానని" రాసుంది. శవాన్ని పోస్టుమార్టంకు తరలిస్తూ కేసుని అన్నికోణాల్లో పరిశోధిస్తున్నామనీ, త్వరలోనే వెన్నెల ఆత్మహత్యకు మూలకారణాన్ని కనుగొంటామని సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

చేతిలోని పేపర్ కాలనాగులా తోచి ఒక్కసారిగా టీపాయ మీదికి విసిరేశాడు చంద్రం. గాలికి రెపరెపలాడుతున్న పేపర్‌లోని అక్షరాలు ఒక్కొక్కటి ఆటంబాంబుల్లా అతని గుండెల్లో పేలసాగాయి.

'వెన్నెల ఊరేసుకుంది..అలా జరగకుండా ఉండాల్సింది' కళ్ళు తిరుగుతన్నట్టే రెండు చేతుల్తో కణతల్ని గట్టిగా అదుముకుంటూ అనుకున్నాడు చంద్రం. పేపర్లో కళ్లముందు కనిపిస్తున్న వార్త నిజమని నమ్మబుద్ధికావడం లేదతనికి. ఒంట్లోని సత్తువంతా ఆవిరై పోయినట్లనిపించండంతో నిస్త్రాణగా సోఫాలో ఒరిగిపోయాడు.

మూతలు పడుతున్న కనురెప్పల మాటున గతం తాలూకు జ్ఞాపకాలు.

★ ★ ★

"ఏవండీ ఈ అమ్మాయి పేరు వెన్నెల. మా ఊరే. నాకు మంచి స్నేహితురాలు ఇక్కడే ఎంబియేలో జాయినైంది" అప్పుడే ఆఫీసు నుంచి ఇంటికి చేరుకున్న చంద్రం హాల్లో ప్రవేశించగానే పరిచయం చేసింది మాలతి.

'వెన్నెల ఎంత అందమైన పేరు. పేరుకు తగ్గ అందం. అసలు అందానికి అచ్చమైన నిర్వచనంలా ఉందీ అమ్మాయి' మనసులోనే అనుకున్నాడు చంద్రం.

"చిన్నప్పుడే అమ్మానాన్న యాక్సిడెంట్‌లో చనిపోతే వాళ్ల అమ్మమ్మ దగ్గర పెరిగింది వెన్నెల. ఎక్కడ కందిపోతుందోనని తన అరచేతుల మీద నడక నేర్పించాడు ఆమె తండ్రి. దురదృష్టవశాత్తూ కన్నవాళ్ళు పోయాక అంతవరూ అష్టైశ్వర్యాల నడుమ పెరిగిన ఆమె జీవితం ఒక్కరాత్రిలో అతలాకుతలం అయిపోయింది. వ్యాపారంలో నష్టం, దాయాదుల కుతంత్రాల కారణంగా కోట్ల ఆస్తి కళ్ల ముందే కరిగిపోగా కట్టుబట్టలతో అమ్మమ్మ పంచన చేరిందామె. అయితే గత వైభవాన్ని తలచుకుంటూ వర్తమానాన్ని నిందిస్తూ భవిష్యత్తుని మర్చిపోలేదామె. తనకి హైద్రాబాద్‌లో ఎంబియే సీటు వచ్చిందని ఆనందంగా ఫోన్ చేసినప్పుడు మీరు కాదనరన్న ఉద్దేశ్యంతో నేనామెకి మాటిచ్చాను" ఒక్క క్షణం మాట్లాడడం ఆపింది.

"ఏమిటది?" అడిగాడు చంద్రం.

"ఇకనుంచి వెన్నెల మనింట్లోనే ఉంటుంది. అంటే మనతోనే.." చెప్పింది మాలతి.

"ఓస్ అంతేనా? ఈ మహానగరంలో ఆడపిల్ల ఒంటరిగా ఉండడం అంత క్షేమకరం కాదు. నిశ్చింతగా మనతోనే ఉండొచ్చు. అలా అయితేనే ఏ ఇబ్బందీ లేకుండా ఆమె చదువు సాగుతుంది" మనస్ఫూర్తిగా అన్నాడు చంద్రం.

★ ★ ★

కొన్ని పరిచయాల వల్ల నిర్లిప్తంగా, నిస్తేజంగా సాగిపోయే జీవితానికి నూతన జవసత్వాలు వస్తాయి. జీవనమాధుర్యం అంటే అర్థం అవుతుంది. చాలాకొద్దిమంది తమ ఉనికి కారణంగా ప్రపంచానికే ప్రత్యేకతను చేకూరుస్తారు. అలాంటి వారెక్కడున్నా కాలం జీవం పోసుకుంటుంది. వారు తమ వ్యక్తిత్వపు పరిమళాలను పంచుతూ ప్రతి క్షణానికీ చైతన్యం కలిగేలా చేస్తారు.

కాలం గడుస్తున్నకొద్దీ వెన్నెలతో వారి అనుబంధం బలపడసాగింది. వెన్నెలను కూడా తమ ఇంట్లో ఒక సభ్యురాలిగానే పరిగణించసాగారు. వెన్నెల ఒక అతిథిలా కాకుండా ఆత్మీయురాలిగా తోచసాగింది.

★ ★ ★

"ఏవండీ సాయంత్రం కాస్త త్వరగా వచ్చేస్తారు కదూ డాక్టర్ దగ్గరకి చెకప్‌కి వెళ్లాలి" చంద్రం ఆఫీసుకి బయలుదేరుతుండగా అడిగింది మాలతి.

చంద్రం నిస్సహాయంగా ఆమెవంక చూశాడు. మాలతికిప్పుడు ఏడోనెల. మొదటి ప్రెగ్నెన్సీ కాబట్టి ఇద్దరికీ టెన్షన్‌గా ఉంది.

"ఎలా మాలతీ! నాల్గురోజుల్లో ఇన్‌స్పెక్షన్. సెలవు కూడా దొరకదు. ఈ ఒక్కరోజు వెన్నెలని తోడుతీసుకెళ్లు"

"వెన్నెలనా వద్దు. తన చదువు పాడవుతుంది" అంది మాలతి.

అప్పటిదాకా అక్కడే ఉండి వీళ్ల సంభాషణ వింటున్న వెన్నెల మాలతి దగ్గరగా వచ్చి ఆమె పక్కనే కూర్చుంటూ చెప్పింది.

"నీతో హాస్పిటల్‌కి వచ్చినంత మాత్రాన నా చదువేం పాడవదుగాని త్వరగా తయారవ్వు డాక్టర్ దగ్గరకెళదాం" ఆమె మాటలకు కొండంత ధైర్యం వచ్చినట్లయింది చంద్రానికి.

"థ్యాంక్స్ వెన్నెలా" మనస్ఫూర్తిగా అన్నాడు.

"ఈ టైంలో పెద్దదిక్కుకావాలంటారు. తల్లి పక్కన ఉంటే కొండంత ధైర్యం" అంది వెన్నెల మాలతినుద్దేశించి చంద్రంతో.

వెన్నెల మాటలు చంద్రాన్ని ఆలోచలో పడేశాయి. ఆ సాయంత్రం చంద్రం ఆఫీసు నుంచి తిరిగొచ్చాక వెన్నెల బలవంతం మీద మాలతిని పుట్టింటికి పంపడానికి సిద్ధపడ్డాడు చంద్రం.

రైలు కదిలేదాకా వెన్నెలకి ఎన్నో జాగ్రత్తలు చెప్పింది మాలతి. ఆమె తపన అంతా తన గురించేనన్న విషయాన్ని గమనిస్తున్న చంద్రానికి తన పట్ల మాలతికి ఉన్న అనురాగానికి కళ్ళు చెమర్చాయి.

"నువ్వింక ఆయన విషయం మర్చిపో మాలతీ. ప్రతి విషయాన్ని నేను దగ్గరుండి చూసుకుంటాను" వెన్నెల ఇచ్చిన భరోసాతో మాలతి కుదుటపడింది.

★ ★ ★

జీవితంలో ఏ ఒక్క సంఘటనా మనిషి ఊహిం

చినట్లుగా యధాతథంగా జరగడం అసాధ్యం. అసంకల్పితంగా జరిగే పరిణామాలకి మౌనసాక్షిగా మిగిలిపోవడం తప్ప వాటికి జవాబుదారీ కావడానికి ఎవ్వరికీ మనసు అంగీకరించదు. ఆ రోజు ఆది వారం కావడం మూలాన కొంత వెసులుబాటు దొరి కింది చంద్రానికి. హాల్లో సోఫాలో కూర్చుని పేపర్ చదవసాగాడు.

"ఏంటి బాసూ పరిసరాలని కూడా పట్టించుకో నంత పరధ్యానం" అన్నాడు గురుమూర్తి.

పక్కనే పరిచయం ఉన్న గొంతు విని ఉలిక్కిపడి తలెత్తాడు చంద్రం. ఎదు రుగా గురుమూర్తి.

గురుమూర్తి కూడా చంద్రం ఆఫీసులోనే పనిచే స్తున్నాడు. లోపలికి వచ్చేముందు కనీసం తలు పన్నా తట్టి అనుమతి తీసుకోవాలన్న ఇంగితం కూడా లేని గురుమూర్తి చొరవ ఎందుకో ఇబ్బంది కరంగా తోచింది చంద్రానికి.

"రా..గురుమూర్తీ కూర్చో" తీరాలోపలికి వచ్చే శాక ఇంటికి వచ్చిన అతిధిని అవమానించడం ఇష్టం లేక తెచ్చిపెట్టుకున్న మర్యాదతో ఆహ్వానిం చాడు.

"ఏవిటిలా ఎకాఎకిన లోపలికి వచ్చేశాడు అను కుంటున్నావు కదూ. మనకి కొంచెం మొహమాటం తక్కువేలే బాసూ. కాఫీ టైం కదా నేవస్తున్నట్టు ముందే గమనిస్తే కప్పు దాచేసేస్తావేమోనని జాగ్రత్త పడ్డానంతే" అదో పెద్దజోక్‌లా గట్టిగా నవ్వుతూ అన్నాడు గురుమూర్తి.

"కాఫీ కావాలంటే డైరెక్ట్‌గానే అడ గొచ్చు కదా"

"అందుబాటులో ఉన్న దాన్ని దేన్నీ వదిలే అల వాటులేనివాడ్ని ఏమం టారో తెలుసా? గురు మూర్తి. అదీ మన టాలెంట్" జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి టేబుల్ మీదపెడ్తూ అన్నాడు గురుమూర్తి.



ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది పోటీలో ఎంపికైన కథ


సమాజంలో ఇలాంటి గురుమూర్తులు చాలామంది తారసపడుతూ ఉంటారు మనకి. వీళ్ల అసలు టాలెంట్ ఏవిటో ఎవరికీ తెలియదు. ఎవరెక్కడ ఏ టాపిక్ మాట్లాడినా అవసరం ఉన్నా లేకున్నా మధ్యలోకి చొచ్చుకుపోయి అనర్గళంగా మాట్లాడేస్తుంటారు. అది తన ప్రత్యేకత అనుకుంటారు.

వీళ్ల మాటలు వినిపించినట్లుగా లోపల్నించి వెన్నెల రెండుకాఫీ కప్పుల్ని ట్రేలో పెట్టుకుని హాల్లోకి ప్రవేశించింది.

"థ్యాంక్యూ వెన్నెలా...అసలు నేనే అడుగుదామనుకున్నాను" కప్పందుకుంటూ అన్నాడు చంద్రం.


"ఇతను గురుమూర్తీ అనీ మా కొలీగ్" గురుమూర్తిని వెన్నెలకి పరిచయం చేయడానికి తలెత్తాడు చంద్రం. ఎదురుగా కనిపించిన దృశ్యానికి అతడెంతగా నిర్వీర్యుడైనాడంటే కళ్లముందు జరుగుతున్నదేమిటో అర్థం కాలేదతనికి.

నమస్కరించడానికి ఎత్తబోతున్న వెన్నెల చేతులు మధ్యలోనే ఆగిపోయాయి. భయంతోనో, ఆశ్చర్యంతోనో పెద్దవయిన ఆమె కళ్ళు రెప్పవేయడం



## కాలం తెచ్చిన మార్పు

కాలం తెచ్చే మార్పునుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. ఎప్పుడూ క్రేజీ హీరోయిన్‌గా, యువతరాన్ని ఉర్రూతలూగించే డ్రెస్‌లతో అందర్నీ అలరించే అందాలభామ ఊర్మిళామతోండ్కర్ ఇప్పుడు కాలం తెచ్చే మార్పుకి తలవొగ్గిందా అన్నట్టుగా ఉంది. కొత్త చిత్రం బనారస్ కోసం ఆమె తన లైఫ్ స్టైల్‌ని, డ్రెస్ స్టైల్‌ని కూడా మార్చేసుకుంది. ఈ బనారస్ చిత్రం ఆధ్యాత్మికతకి సంబంధించింది కాబట్టి ఆమె అలా తయారవ్వక తప్పలేదంటున్నాడు డైరెక్టర్ పంకజ్ పరాశర్.




కూడా మర్చిపోయినట్టు నిశ్చేష్టలయ్యాయి. ఇటు గురుమూర్తి పరిస్థితి కూడా అలాగే ఉంది. ముందుగా తేరుకున్నది చంద్రం.

"కాఫీ తీసుకో గురుమూర్తీ" చంద్రం గొంతు చెవులకి సోకి స్పృహలోకి వచ్చిన వెన్నెల గిరుక్కున వెనక్కి తిరిగి లోనికి పరిగెత్తింది. మరుక్షణంలో గురుమూర్తి కూడా కుదుటపడి మామూలు స్థితికి వచ్చాడు.

"వెన్నెల నీకింతకు ముందే తెలుసా గురుమూర్తీ?" చంద్రానికి తన గొంతు తనకే అస్పష్టంగా వినిపించింది.

ఈ ప్రశ్న విని చంద్రం వంక పిచ్చివాడ్ని చూసినట్టు చూశాడు గురుమూర్తి.

"తెలుసు. ఎక్కడ, ఎలా అని మాత్రం అడక్కు. ఇలాంటి ప్రశ్నలకి వెన్నెలే చక్కగా సమాధానాలు చెప్పగలదు. ఎందుకంటే అబద్ధాలు కూడా అతికినట్లు చెప్పగల సామర్థ్యం ఆడవాళ్లకి సొంతం"

"సూటిగా చెప్పు గురుమూర్తీ.." కొంచెం చికాకుగా అన్నాడు చంద్రం.

అదేం గమనించనట్లు చెప్పాడు గురుమూర్తి.

"వినే ఓపిక నీకుండాలి గానీ ఎంతైనా చెప్పగల తీరిక నాకెప్పుడూ ఉంటుంది బాసూ" లోపలినించి ఈ సంభాషణ అంతా వింటున్న వెన్నెల సుడిగాలిలా హాల్లోకి ప్రవేశించింది.

"దయచేసి వెళ్ళిపో గురుమూర్తీ. నీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. వెళ్ళిపో" ఆమె గొంతు గద్గదంగా ఉందప్పుడు.

ఒక్కక్షణం పాటు ఆమెని తేరిపార చూసి అన్నాడు గురుమూర్తి.

"నువ్వేం మారలేదు వెన్నెలా! సరే ఇంతిలా బ్రతిమాలుతున్నావు కాబట్టి వెళ్లిపోతున్నాను" గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లిపోయాడు గురుమూర్తి.

జరిగిన సంఘటనకి కర్రాటే అయ్యాడు చంద్రం. అయోమయంలో అతనికి నోటమాటరాలేదు. తిరిగి తేరుకోవడానికి చాలాసేపు పట్టిందతనికి.

★ ★ ★

"చెప్పు..వెన్నెల నీకెంతకాలం నుంచి తెలుసు?" కుర్చీలో ముందుకు వంగుతూ అన్నాడు చంద్రం.

ఇద్దరూ బార్‌లో ఓ మూలకూర్చుని ఉన్నారు. ఆరోజు సాయంత్రం ఆఫీసు అయిపోగానే గురుమూర్తిని పట్టుకున్నాడు చంద్రం.

"అంత తొందరెందుకు బాసూ! ఓ పెగ్గుపడితే చాలు. సంగతులు వాటంతట అవే తన్నుకుంటూ వస్తాయి" సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు గురుమూర్తి.

"మొత్తానికి గ్రంథసాంగుడివే. ఈ విషయంలో మమ్మల్నందర్నీ మించిపోయావ్ బాసూ"

"గురుమూర్తీ...నువ్వేం అంటున్నావో నాకర్థంకావడం లేదు. చదువుకున్న ఆటవికుడిలా కన్పిస్తున్నావు" గురుమూర్తి మాటలు కంపరం పుట్టించాయి చంద్రానికి.

"అసలు విషయంలోకిరా గురుమూర్తీ!" అసహనంగా అన్నాడు చంద్రం.

"1996...అమ్లాపురంలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాను. వెన్నెలది కూడా అమ్లాపురమే టెన్త్‌క్లాస్. స్వీట్ సిక్స్‌టీన్ ఇయర్స్. సెక్సీ ఫిగర్. రోడ్డుమీద కొస్తే ట్రాఫిక్ జాం" చెప్తున్న వాడల్లా హఠాత్తుగా ఆపి-

"కొంచెం మందుపోసి మన పర్సనల్ మాటర్స్ చెప్పించేద్దామనుకుంటున్నావా?" అనుమానంగా చూస్తూ అన్నాడు. చంద్రానికి అర్థమైంది గురుమూర్తికి పూర్తిగా ఎక్కింది.

"అదేంలేదు చెప్పు"

"నేను చూస్తూనే ఉన్నాను. నువ్వు తాగడం లేదు" అన్నాడు గురుమూర్తి.

ఇక చేసేదేం లేక మళ్లీ గ్లాసులో మందునింపుకుని చప్పరించసాగాడు చంద్రం. అది చూసిన గురుమూర్తి సంతృప్తిగా నవ్వుతూ అన్నాడు.

"గుడ్‌బాయ్"

చంద్రం గ్లాసులోని ద్రవం పూర్తిగా తాగేదాకా ఆగి తిరిగి నింపుతూ మాట్లాడసాగాడు గురుమూర్తి.

"రేసుగుర్రం లాంటి ఈడు. రెక్కల గుర్రాల్లాంటి కోర్కెలు. కానీ పూర్ ఫ్యామిలీ పాపం. సరిగ్గా అప్పుడు మనం తగులుకున్నాం. మా పరిచయం పార్కుల నుంచి రిసార్ట్స్ దాకా పాకింది"

"తర్వాత" గురుమూర్తి మాట్లాడడం ఆపేసరికి రెట్టించాడు చంద్రం.

"ఓ ఫైన్ మార్నింగ్. నెలతప్పానంది. పెళ్లిచేసుకోమంది. అది మాత్రం కుదర్దు అబార్షన్ చేయించుకో అన్నాను"

"ఇదంతా ఇంటర్ చదివేటప్పుడే.."

"పువ్వు పుట్టగానే పరిమళించడం అంటే ఇదే బాసూ. అంతే తర్వాత ఎపిసోడ్ అమ్లాపురంలో క్లోజ్, హైదరాబాద్‌లో ఓపెన్. కాకపోతే హీరో ఛేంజ్. ఫస్ట్ ఎపిసోడ్‌లో నేనైతే, సెకండ్ ఎపిసోడ్‌లో నువ్వు..అంతే"

"నువ్వు అనవసరంగా ఊహించుకుంటున్నావు గురుమూర్తీ.. మా మధ్య అలాంటిదేం లేదు"

చంద్రం మాటలకు గురుమూర్తి అతడ్ని ఓ వెర్రివాడిని చూసినట్టు చూశాడు.

"అవకాశం వచ్చినప్పుడు మీనమేషాలు లెక్కబెడుతూ కూర్చునేవాడిని వెర్రిబాగులోడంటారు. చెయ్యేస్తే అందేంత దూరంలో అందాలు. నిన్నే మను కోవాలో అర్థంకావడం లేదు" గురుమూర్తి మాటలు చంద్రం మనస్సు లోతుల్లోకి చొచ్చుకుపోసాగాయి. మంచి కన్నా చెడువైపునకే మనస్సు ఎక్కువగా ఆకర్షితమవుతుంది. అందునా మనిషి మనస్సు ఎంత బలహీనమైందంటే తనకు అనుకూలమైన వాటిని మాత్రం గ్రహించి మిగిలినవాటిని చాలా కన్వీనియెంట్‌గా మర్చిపోగలదు. చంద్రం మనస్సు శరీరం కూడా మొద్దుబారిపోయి నట్లనిపించసాగాయి.

బిల్‌పే చేసి ఇద్దరూ బయటికి వచ్చారు. చంద్రం ఆటో ఎక్కుతుండగా "బాసూ ఒక్కమాట. ఇలాంటోళ్లని ఇంట్లో పెట్టుకోకూడదు. వీళ్ల మాయలో పడితే మనింటి ఆడోళ్ళు కూడా వీళ్ల బాట పట్టే ప్రమాదం ఉంది. నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇప్పటిదాకా నేను చెప్పిన విషయాలన్నీ పచ్చి నిజాలు. కావాలంటే చెప్పు ప్రతి విషయాన్ని సాక్ష్యాల్తో సహా రుజూచేయగలను" గురుమూర్తి మాటలు పూర్తికాకుండానే ఆటో కదిలింది.

* * *

చంద్రాన్ని ఆస్థితిలో చూసిన వెన్నెల ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది. నిలకడకోల్పోయి దాదాపు ఊగుతున్నాడతను. ఆసరా చేసుకుని నిలబడబోయి ఉన్నచోటే కుప్పకూలిపోయాడు. అది చూసిన వెన్నెల ఒక్క అంగలో చంద్రాన్ని సమీపించి చేయి ఆసరాగా అందిస్తూ-

"ఏమైంది?"

మూతలు పడుతున్న కళ్లని బలవంతంగా తెరిచి చూశాడు చంద్రం ఎదురుగా మనస్ఫూర్తిగా వెన్నెల చెయ్యిచాచి ఆహ్వానిస్తున్నట్లుగా.

"అవును గురుమూర్తి చెప్పింది అక్షరసత్యం. ఈకాలంలో ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో అర్థంకావడంలేదు" మనస్సులో అనుకున్నానుకున్నా మద్యం మత్తులో పైకి అనేశాడు.

"ఏం చెప్పాడు గురుమూర్తి" బులెట్‌లాంటి ఆ ప్రశ్నకి ఒక్కక్షణం తడబడ్డాడు చంద్రం.

"అంతా చెప్పేడు వెన్నెలా....నువ్వేంటో నీగతమేంటో అక్షరమక్షరం విడమరిచి చెప్పాడు"

"అనుకున్నాను. అర్థరాత్రి దాకా ఇంతగాతాగి ఇంటికి చేరినప్పుడే అనుకున్నాను. ఇలాంటిదేదో జరిగి ఉంటుందని..."

"అయితే చెప్పు. నిజమేమిటో ఇప్పుడే తెలియాలి నాకు"

"ఏ నిజాలు కావాలి మీకు"

"నటించకు. వెన్నెలా ఇంకా నటించి నన్ను నమ్మించాలని ప్రయత్నించకు"

"ఏం చెప్పినా అర్థం చేసుకునే స్థితిలో లేరు మీరు. గురుమూర్తి మాటల్ని విశ్వసించకండి" అంది ప్రాధేయపూర్వకంగా వెన్నెల.

"ఆహా ఎంత గొప్పగా సెలవిచ్చావు వెన్నెలా. మేం రాక్షసులం. నువ్వు మాత్రం అమాయకురాలివి..అంతేకదా" అప్పటిదాకా నేలమీద కూర్చునే మాట్లాడుతున్న చంద్రం హఠాత్తుగా చివ్వున లేచి నిల్చున్నాడు.

"అయినా అర్థరాత్రి పరాయి మగాడు త్రాగి ఇంటికొస్తే పరిచర్యలు చేయడానికి పరిగెట్టుకొచ్చిన నీ గురించి గురుమూర్తే చెప్పాలా? భార్య పుట్టింటికి వెళ్లిందని తెలిసీ ఒంటరిమగాడితో ఒకే చూరుక్రింద గడపడానికి సిద్ధపడ్డ నీ వ్యక్తిత్వం గురించి ఇంకొకళ్ళు చెప్పాలా? నీ ఉద్దేశ్యం ఏమిటో అర్థమైంది నాకు నీ మాటలు, నీ చేతలు, నీ సైగలు అర్థం చేసుకోలేనంత అమాయ

## గమ్మత్తయిన ఆచారం

ప్రాచీన మలేషియాలో నివసించే ఓ తెగవారికి ఓ గమ్మత్తైన ఆచారం ఉండేది. ఏ ఇంట్లో అయినా బిడ్డ పుట్టగానే ఏడుగుడ్డపీలికలు ఒకదానిమీద ఒకటి పరిచి ఆ పసికూనను పడుకోబెట్టేవారు. రోజుకో గుడ్డ చొప్పున తీసేస్తూ ఏడోరోజున ఆఖరిగుడ్డను తీసి అప్పుడు పెట్టే వారట పాపకు పేరు. ఈ ఏడు రోజులూ బాలారిష్ట దినాలుగా లెక్కకట్టేవారు.


## బటన్స్ సేకరణ

లండన్‌లో మేరియన్ చేప్‌మెన్ అనే మహిళ గత రెండు దశాబ్దాలుగా వివిధ దేశనాయకుల కోటు బటన్లు కొన్నివేలు సేకరించడం జరిగింది. ఆమె దగ్గర సర్వాధికారి హిట్లర్ షర్ట్ బటన్స్, ఏడవ ఎడ్వర్డ్ ప్రభువు ఆయన వివాహ సమయంలో ధరించిన కోటు దంతపు బటన్స్ కూడా ఉండడం విశేషం. ఈ బటన్స్ సేకరణద్వారా అక్కడ ఆమె ప్రముఖురాలయ్యింది.

## వృద్ధనారి

ఇంగ్లండ్‌లో జన్మించిన జెనిఫర్ ముర్రో తన 56వ సంవత్సరంలో ఒంటరిగా ప్రపంచమంతా చుట్టిరావాలని నిర్ణయించి హెలికాప్టర్‌లో 97రోజుల్లో 28దేశాలు చుట్టి తిరిగి ఇంగ్లండ్‌కు చేరుకుంది. ఈ ప్రయాణంలో హెలికాప్టర్‌కు పెట్రోల్ పోసేందుకు 86చోట్ల ఆగవలసి వచ్చింది. ఆ యాత్రలో ఈమె హెలికాప్టర్‌తో ఢిల్లీకి కూడా వచ్చిపోవడం విశేషం.

-రమణకుమార్



కుడ్ని''

"తాగిన మత్తులో ఏంటేంటో మాట్లాడుతున్నారు''

వెన్నెల మాటలు పూర్తికాకుండానే ఆమెని తన బాహువుల్లో బంధించాడు చంద్రం. ఎంత పెనుగులాడుతున్నా చంద్రం మరింతగా రెచ్చిపోగాడు. చివరకి పశుబలమే నెగ్గింది. వికృతంగా మారిన చంద్రం ముఖం చూడడం ఇష్టం లేనట్లుగా కళ్ళుమూసుకుందామె. ఆ రాక్షసకృత్యానికి సాక్ష్యంగా నిలవడం ఇష్టం లేనట్లుగా కరెంట్ కూడా పోయింది.

* * *

మర్నాడు ఉదయం దాదాపు పదిన్నర ప్రాంతంలో చంద్రానికి మెలకువ వచ్చింది. హేంగోవర్ వల్ల తలంతా దిమ్ముగా, సమ్మెటపోట్లు పడుతున్నట్లు నొప్పిగా అనిపించసాగింది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. చాలా ఇబ్బందికరమైన నిశ్శబ్దం. చంద్రం మనస్సులో ఏదో తెలియని అనుమానం. చివాలున మంచం దిగి ఇల్లంతా కలియజూశాడు. వెన్నెల కనిపించలేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. వెంటనే గురుమూర్తికి ఫోన్ చేశాడు.

"గురుమూర్తీ వెన్నెల ఇంట్లోంచి వెళ్లిపోయింది'' కంగారుగా చెప్పాడు.

"తన నిజస్వరూపం ఏమిటో బయటపడేసరికి ముఖం చెల్లక ఇంట్లోంచి వెళ్లిపోయిందేమో. నువ్వేం కంగారుపడకు. ఇదీ ఒకందుకు మంచిదే'' చాలా కూల్‌గా చెప్పాడు గురుమూర్తి.

"అదికాదు గురుమూర్తీ. ఈ విషయం మాలతికి చెప్పినా పోలీస్ కంప్లయింట్ ఇచ్చినా కొంపలంటుకుంటాయి'' దాదాపుగా ఏడుపుగొంతుతో అన్నాడు చంద్రం.

"నీది అనవసరపు భయం బాసూ. ఒకవేళ అలాంటి అఘాయిత్యం చేసేదైతే ఇల్లెందుకు ఖాళీచేస్తుంది. నువ్వేం టెన్షన్‌పడకు'' ఓదార్చాడు గురుమూర్తి.

గురుమూర్తితో మాట్లాడిన తర్వాత ధైర్యం వచ్చింది చంద్రానికి. అయినా మనస్సులో ఏదో తెలియని ఆందోళన. ఏ పనీచేయాలన్పించలేదు. ఆఫీసుకు వెళ్లబుద్ధికాక ఫోనోగ్రాం పంపించాడు. రెండురోజులు భారంగా గడిచాయి.

* * *

"సార్ కొరియర్...'' కొరియర్ బాయ్ అరుపుతో గత జ్ఞాపకాల నుంచి వాస్తవంలోకి వచ్చాడు చంద్రం. ఎదురుగా టేబుల్ మీద న్యూస్‌పేపర్ బుసలు కొడుతున్న త్రాచుపాములా గాలికి ఎగురుతోంది.

వణుకుతున్న చేతుల్తో ఉత్తరం అందుకుని చదవడం ప్రారంభించాడు చంద్రం.

"ఏ సంబోధనకు అర్హులు కానీ మీకు!

నా అనుమానమే నిజమైంది. గురుమూర్తిని మీతో చూసినప్పుడే నా జీవితంలో మరో తుపాను రాబోతోందనీ అర్థమైంది. కొన్ని పీడకలలుంటాయి. అవి జీవితాంతం వెంటాడతాయి. ఎంతగా తప్పించుకోవాలని చూసినా వెన్నంటి వస్తాయి. నేను అమలాపురంలో చదువుకుంటున్న రోజుల్లో తారసపడ్డ పీడకల ఈ గురుమూర్తి. రోడ్డుమీద కొస్తే చాలు రాకెట్ ప్రేమలేఖలు, వెనకనుంచి వెకిలి కామెంట్‌లు. బయట తిరగాలంటేనే భయమేసేది. విషయం తెలిసిన పెద్దవాళ్ళు నాదే తప్పన్నారు. హాస్టల్లో చేరాను. అక్కడా వదల్లేదు.

గోడల మీద అసహ్యకరమైన రాతలు. కనిపించినవాడికల్లా నా ప్రవర్తన గురించి ఆటవిక ప్రచారాలు. ఒక స్త్రీని సంస్కారవంతమైన దృష్టితో చూసినంతకాలం ఆమె నడవడి ఉన్నతంగా కనిపిస్తుంది. దృక్కోణం మారితే ఆమె ప్రతి కదలికా పురుషుణ్ణి రెచ్చగొట్టేలా అనిపిస్తుంది. నేను ఊహించగలను. గురుమూర్తి మాటలు మిమ్మల్ని ఎంత విషపూరితం చేశాయో.

అదే వెన్నెల..అదే ప్రవర్తన. ఒక్కరాత్రిలో ఎలా నమ్మగలిగారు? ఒకవేళ గురుమూర్తి చెప్పినంత అసహ్యకరమైన గతమే నాకుంటే మీతో కలిసి ఎందుకుంటాను? నా స్వేచ్ఛకు నేనే ఎందుకు సంకెళ్ళు వేసుకుంటాను. తప్పుచేసిన ప్రతివాడూ తనకు కవచంలా ఒక సమర్థవంతమైన వాదన నిర్మించుకుంటాడు తాను చేసిన తప్పులన్నీ ఒప్పులేనని. పరిస్థితుల ప్రభావమే తన ప్రవర్తనకు కారణం అని నమ్ముతాడు. ఇప్పుడు మీరు కూడా మీ ప్రవర్తనని సమర్థించుకోవడానికి ఓ బలమైన వాదనతో సిద్ధంగా ఉంటారని నాకు తెలుసు. ఏ వాదనలూ, పశ్చాత్తాపాలూ నాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దలేవు గదా శాశ్వతంగా సెలవు తీసుకుంటూ.

-వెన్నెల''

ఉత్తరం చదవడం పూర్తిచేసిన చంద్రం నిస్సత్తువగా మంచం మీద వాలిపోయాడు. ఆలోచిస్తుంటే క్షణికావేశంలో తానెంత పెద్ద తప్పుచేశాడో అర్థమవ్వసాగింది. జరిగిన ఒక్కొక్క సంఘటనా జ్ఞాపకం వస్తుండడంతో అతనిలో అంతర్మథనం మొదలయింది. తాను చేసిన పాపం పెనుభూతంలా వేయిచేతులు చాచి తన్ను కబళించడానికి వస్తున్నట్లనిపించి ఒణికిపోసాగాడు.

తాను హత్యచేశాడు... తాను హంతకుడు.


## నవ్వకూడదట!

ఎయిర్‌పోర్ట్, హాస్పిటల్స్, బ్యాంక్‌లు, కాల్‌సెంటర్లలోని ఉద్యోగులు కస్టమర్లు ఎలాంటి వారైనా అంటే వాళ్ళు అరచినా, కోప్పడినా ప్రశాంతంగా నవ్వుముఖాలతో ఉండాలని మేనేజ్‌మెంట్ వారు తర్ఫీదుని ఇస్తుంటారు. కానీ మనస్సులో భగ్గుమంటున్నా అలా నవ్వుముఖంతో ఉండడం అంత మంచిది కాదని వైద్యనిపుణులు అంటున్నారు. ఇటీవల పై తరగతులకి చెందిన 4000మంది ఉద్యోగుల ఆరోగ్యాన్ని పరీక్షించాక వారిలో చాలా మంది నిస్త్రాణ పడి ఉన్నవాళ్ళు, డిప్రెషన్‌కి లోనైన వాళ్ళు, గుండె జబ్బులతో ఉన్నవాళ్ళు కనిపించారుట. వారిలో సగం మందిని పెంకి కస్టమర్స్‌తో దురుసుగా ప్రవర్తించి చూడండని చెప్పి మరికొన్నాళ్ళు పోయాక వాళ్లని మెడికల్‌గా పరీక్షిస్తే వాళ్లల్లో చెప్పుకోదగ్గ మార్పు కన్పించిందట. లోపలున్న టెన్షన్లని అణిచిపెట్టుకుని పైకి నవ్వడం మంచిదికాదని వైద్యులంటున్నారు.

## చాక్లెట్లు తిన్న ఏనుగు

శ్రీలంకలో 150 ఏళ్ల గంగా రామాయమందిరంలో ఉగాది పండుగ వేడుకల సమయంలో రాజీ అనే 45ఏళ్ళ ఏనుగును తీసుకువచ్చారట. ప్రేక్షకులు తినిపించిన కుకీలు, చాక్లెట్లు అతిగా తిన్న ఆ ఏనుగుకు కడుపు నొప్పి వచ్చి మూలగసాగింది. దాన్ని జ్యూకి తీసుకుపోయిన జంతువైద్యులు చికిత్స చేశారు.

-తటవర్తి



టెన్షన్‌తో చంద్రం నుదుట నుంచి చెమట ధారగా కారసాగింది. తాను స్పృహలో ఉన్నాడో లేక స్పృహ కోల్పోయాడో కూడా తెలియని సుషుప్తిలో సొమ్మసిల్లి పడుకుండిపోయాడు. ఎంతసేపలా గడిచిందో తెలీదు. పోనుపోను మెదడు మొద్దుబారి ఆలోచించడం మానేసింది. సాయంత్రం ఆరున్నర అవుతుండగా వచ్చాడు గురుమూర్తి. మంచం మీద నిస్త్రాణగా పడుకున్న చంద్రాన్ని సమీపించి "ఏమైంది బాసూ... ఆరోగ్యం బాగాలేదా?" నుదుటి మీద చెయ్యి వేస్తూ "అబ్బా...ఒళ్లంతా పెనంలా కాలిపోతోంది బాసూ. పద డాక్టర్ దగ్గరకెళ్దాం" కంగారుగా అన్నాడు గురుమూర్తి.

అంతదాకా మగతలో ఉన్న చంద్రం గురుమూర్తి స్పర్శతో స్పృహలోకొచ్చాడు. గురుమూర్తిని చూడగానే అంతవరకూ గుండెలోతుల్లో అణిచిపెట్టబడ్డ ఆవేశం ప్రళయకాలంలో తాడెత్తున ఎగిసిపడే ఉత్తుంగతరంగం చెలియలికట్టని దాటినట్లు అతని గుండెలోతుల్ని దాటింది. 'ఇన్ని అనర్థాలకి మూలకారణం వీడేకదా' అన్న భావన నిలువెల్లా దహించివేయసాగింది.

"చెప్పు గురుమూర్తీ. ఎందుకు చేశావిలా?" సాధ్యమైనంతవరకూ కంట్రోల్‌లో ఉండడానికే ప్రయత్నిస్తూ అన్నాడు చంద్రం.

"ఎంత మాటనేశావు బాసూ...నేనేం చేశాను?" అన్నాడు గురుమూర్తి.

"అభం శుభం తెలియని ఒక అమాయకురాలిపైన లేనిపోని అభాండాలేయడానికి సిగ్గులేదూ...ఛీ...ఛీ..నువ్వు మనిషివి కాదు" చంద్రం చేతిలోని కాలర్‌ని విడిపించుకుంటూ అన్నాడు గురుమూర్తి "ఈ వరస నాకేం అర్థంకావడం లేదు" టీపాయ్‌మీదున్న న్యూస్‌పేపర్ని, వెన్నెల రాసిన ఉత్తరాన్నీ గురుమూర్తి ముఖం మీదికి విసిరేస్తూ.

"స్వచ్ఛమైన వెన్నెల క్యారెక్టర్ మీద నా అభిప్రాయం మారిపోయేలా చేశావు. నీ మాటలు నిజమని నమ్మిన నేను నువ్వు చేసిన ఈ ఘాతుకానికి నిన్ను ఉరితీసినా పాపం లేదు" అన్నాడు చంద్రం.

అతని కళ్లల్లో ఎరుపు జీరలు చూసి రెండడుగులు వెనక్కి వేశాడు గురుమూర్తి.

"గురుమూర్తీ. వెన్నెల చచ్చిపోయింది. కాదు...వెన్నెలని చంపేశాం. నువ్వు నేను ఈ సమాజం అంతా కలిసి వెన్నెలని దారుణంగా చంపేశాం" హిస్టీరిక్‌గా ఏడవసాగాడు చంద్రం. ఇంతలో వెన్నెల రాసిన ఉత్తరాన్ని చదివిన గురుమూర్తి దాన్ని ముక్కలుముక్కలుగా చించేశాడు. అది చూసిన చంద్రం

"గురుమూర్తీ ఏమిటది?"

"ఇలాంటి ఉత్తరాలు బయటపడితే ఎప్పటికైనా ప్రమాదమే బాసూ. నువ్వేం కంగారుపడకు. ప్రతి సమస్యకూ ఒక పరిష్కారం తప్పకుండా ఉంటుంది. చాలా కూల్‌గా చెప్పాడు గురుమూర్తి"

"ఈ ఉత్తరం చింపేసినంత మాత్రాన చేసిన పాపం సమసిపోదు గురుమూర్తీ. ఈ పాపానికి నిష్కృతిలేదు. ఆ భగవంతుడు కూడా క్షమించడు"

"జరిగిందేదో జరిగిపోయింది. అనవసరంగా రాద్ధాంతం చేయకు బాసూ"

"ఎంత తేలిగ్గా అనేశావు గురుమూర్తీ"

"బాసూ...ఓ విషయం చెప్పనా! ఈలోకంలో మూడురకాల మంచివాళ్లుంటారు. అవకాశాలు దొరక్క చాలామంది మంచివాళ్లలాగా మిగిలిపోతారు. అవకాశాలు అందివచ్చినా అందుకునే ధైర్యం లేని పిరికివాళ్ళు కొందరు మంచివాళ్లలాగా చలామణీ అయిపోతుంటారు. దొరికిన అవకాశాన్నల్లా అనుభవించేసి ఒకవేళ పరిస్థితులు ఎదురుతిరిగితే పాపం పక్కవాడి మీదికి నెట్టేసి తాము మాత్రం మంచివాళ్లమని జనాల్ని నమ్మించే ప్రయత్నం చేస్తుంటారు కొందరు. నువ్వా మూడవరకం మంచివాడివి బాసూ. చెయ్యాల్సిందంతా చేసేసి ఇప్పుడు పరిస్థితులు వికటించేసరికి నెపం నా మీద పెట్టి తప్పించుకోవాలని చూస్తున్నావు. తప్పు బాసూ! ఒకవేళ వెన్నెల నీకు లొంగిపోయి సహకరించి ఉంటే గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిపిస్తూ ఉండేవాడివి కావా! ఎందుకు బాసూ ఈ అనవసర హిపోక్రసీ. ఏ ఇరానీ హోటల్‌కో వెళ్లి చూడు. నాలాంటి వాళ్ళు టేబుల్‌కి ముగ్గురు కనిపిస్తారు. ఊసుబోక మాట్లాడే ఇలాంటి హాట్ టాపిక్‌లని నమ్మడం కోసమే నీలాంటి అవకాశవాదులు సిద్ధపడి వస్తారు. ఇప్పుడు చెప్పు. తప్పు నీదా? నాదా?"

"నువ్వు ఎన్నైనా చెప్పు. ఈ పాపంలో నీకూ భాగం ఉంది" గురుమూర్తి వాదనలో పదునుకి మారుమాట్లాడలేని చంద్రం నిస్సహాయంగా అన్నాడు.

"తప్పకుండా అందుకు సారీ చెప్పుకుంటున్నాను. ఈ సమాజంలో నాలాంటివాళ్ళు నీలాంటి వాళ్ళు ఉన్నంతకాలం ఇలాంటి సంఘటనలు ప్రతిరోజూ జరుగుతూనే ఉంటాయి" గురుమూర్తి మరోమాటకు అవకాశం ఇవ్వకుండా తలుపు తీసుకుని బయటకు వెళ్లిపోయాడు. ఒంటరిగా మిగిలిపోయిన చంద్రం గుండెల్ని దాటి వెన్నెల గొంతు వేయిగొంతుకలతో దిగంతాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఈ సమాజాన్ని ప్రశ్నిస్తూనే ఉంది.

ఈపాపం ఎవ్వరిది?

★



## ఇన్‌స్పిరేషన్

మనవాళ్ళు ఇంగ్లీషు చిత్రాలను ఔపోసన పట్టి బాలీవుడ్, టాలీవుడ్‌లలో చిత్రాలు తీస్తూ ఉంటారు. తాము తీసే చిత్రం మంచి సబ్జెక్ట్‌తో జనాన్ని అలరిస్తుందని వ్యాఖ్యానిస్తుంటారు. ఇప్పుడు హారీ బవేజా కూడా లవ్ స్టోరీ2050 అంటూ ఓ సైన్స్ ఫిక్షన్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం హెచ్.జి.వెల్స్ టైం మెషీన్ చిత్రానికి ప్రేరణ అని భావిస్తున్నారు. అందాల తార ప్రియంకాచోప్రా ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సైన్స్ ఫిక్షన్ మూవీ ప్రియాంకాని ఏ రేంజ్‌కు తీసుకెళుతుందో చూడాల్సిందే!

